క్లుప్తంగా

సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో మహిళా ఉద్యోగి హల్‌చల్

వనపర్తి: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం అదే శాఖకు చెందిన పక్క జిల్లాలో పనిచేసే ఓ మహిళా ఉద్యోగి హల్‌చల్ చేస్తూ.. సాటి ఉద్యోగులతో పాటు తమను దూషించించారని దస్తావేజు లేఖరులు డీఆర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు పాలమూరుకు పలువురు దస్తావేజు లేఖరులు వెళ్లనున్నట్లు సమాచారం. ఈ కార్యాలయంతో ఎలాంటి సంబంధం లేకపోయినా.. ఇక్కడికి వచ్చి ఉద్యోగులను, తమను కించపరిచినట్లు మాట్లాడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ చేస్తామని డీఆర్ హామీ ఇచ్చినట్లు తెలిసింది.

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి



మదనాపురం: ఎన్నో ఒడిదుడుకులు, కష్టాలకు ఓర్చుకొని చదివి, తనకంటూ పేరు ప్రతిష్టలు సంపాదించుకున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు సేవలు మరువలేనివని, అంకితభావంతో పనిచేసి అందరి మన్నలను పొందారని ప్రధానోపాధ్యాయుడు మద్దిలెట్టి అన్నారు. బుధవారం మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉద్యోగ విరమణ చేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసులును ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఘనంగా సన్మానంచారు.

మొక్కల సంరక్షణకు చర్యలు



పెబ్బేరు రూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లికి చెందిన రైతు కాశన్న వ్యవసాయ పొలంలోని మామిడి తోటలో గెట్లకు వెయ్యి టేకు మొక్కలు నాటారు. బుధవారం ఎంపీడీఓ రవీంద్ర, ప్రత్యేక అధికారి నిషిత, ఎంపీఓ రాజు మొక్కలను పరిశీలించారు. వనపర్తి మండలంలోని నాచహల్లిని ఎంపీడీఓ రాఘవ సందర్శించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తుండంతో ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండేందుకు తగు జాగ్రతలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. గ్రామంలో డ్రెయినేజీలను, గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా నర్సరీని పరిశీలించి మొక్కల పెరుగుదలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి మద్దిలేటి, నాగరాజు, ఎఫ్ఏ వెంకటస్వామి, టీఏ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల సేవలు భేష్



పెబ్బేరు రూరల్: ఐదేళ్ల పాటు పదవిలో ఉన్న ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా సేవలు అందించారని ఎంపీపీ ఆవుల శైలజ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. తన ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేశానన్నారు. మండల అభివృద్ధికి తోడ్పాటు అందించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు ఎంపీపీ, ఎంపీటీసీలకు శాలువా, పూలమాలలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ, ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీఓ రోజారెడ్డి, పీఆర్ డీఈ, ఏఈ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలి

వనపర్తి: దివ్యాంగులకు ఇస్తున్న పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుస్వామి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పెన్షన్ల పంపిణీలో కేంద్రం వాటాను రూ.300 నుంచి రూ.3 వేలకు పెంచితే.. రూ.6 పెన్షన్ విధానం సాధ్యమవుతుందన్నారు. దీంతో పాటు దివ్యాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ ఏఓ భానుకు వినతిపత్రం అందజేశారు. అధికారులు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఉమాదేవి, చిట్టి అనంతమ్మ, ఎల్లమ్మ, రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, రవి, వేణుగోపాల్, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.



సేవలు ఘనం.. అందని వేతనం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు (ఫైల్)

- పంచాయతీ సిబ్బందికి నిలిచిన జీతాలు
- అయిదు నెలలుగా నిరీక్షణ
- ఇబ్బంది పడుతున్నామని ఆవేదన

పెబ్బేరు రూరల్: నిత్యం పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమయ్యే గ్రామ పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. అయిదు నెలలుగా జీతాలు రాక అలమటిస్తున్నారు. కరోనా లాంటి సమయంలో ప్రజలు ఇళ్ల నుంచి బయట రావడానికే భయపడిన రోజుల్లో కూడా వీరు ప్రాణాలు పణంగా పెట్టి నిత్యం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీరి విశిష్ట సేవలు గుర్తించి పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. కానీ ప్రస్తుత పరిస్థితులు వాస్తవానికి భిన్నంగా ఉన్నాయి. వీరికి క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాల్సిన ప్రభుత్వం అయిదు నెలలుగా పట్టించుకోకపోవడంతో కుటుంబాలు గడవక దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గ్రామపంచాయతీ అధికారులు సకాలంలోనే ట్రెజరీకి పంపినా వేతనాలు విడుదలలో జాప్యం జరుగుతుంది.

అప్పులు చేసి..

తమకు వచ్చే జీతమే అరకొరగా వస్తుందని.. అది కూడా సక్రమంగా చెల్లించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుచేసి పొట్ట గడుపుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో తమ పిల్లల ఫీజులు, పుస్తకాలు కొనిచ్చేందుకు కూడా తమ స్తోమత సరిపోవట్లేదంటున్నారు. పారిశుద్ధ్య కార్మికులకు తక్షణమే వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ నాయకులతో కలిసి ఇటీవల వేతనాల కోసం రెండు దఫాలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెబ్బేరు మండలంలో 100, శ్రీరంగాపురం 52, వనపర్తి 92మంది గ్రామపంచా యతీ కార్మికులు ఉన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ పరిధిలో వీరిని మల్టీపర్పస్ వర్కర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త, డ్రెయినేజీల నిర్వహణ, హరితహారం మొక్కలు, పాఠశాల్లో పరిశుభ్రత, ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ, విద్యుద్దీపాలు, తాగునీటి సరఫరా, ట్రాక్టర్ల నిర్వహణ తదితర విభాగాల్లో పనులు చేస్తున్నారు. పంచాయతీల్లో ఒక్కో కార్మికుడికి రూ. 9,500 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. బడ్జెట్ ఉన్న గ్రామ పంచాయతీల్లో కొందరికి జీతాలు చెల్లిస్తున్నారు. కొన్ని జీపీల్లో మాత్రం బడ్జెట్ లేదనే సాకుతో అయిదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు.



పెబ్బేరులో పనులు చేస్తున్న కార్మికులు

ఆర్థిక భారం

వేతనాలు రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. మేం నెలవారీ జీతంపైనే ఆధారపడి కాలం వెళ్లదీస్తున్నాం. అలాంటిది మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో అప్పు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు విడుదల చేయాలి.

– నారాయణ, జీపీ కార్మికుడు, సూగూరు

5 నెలలుగా జీతాలు లేవు..

గ్రామ పంచాయతీ కార్మికులకు అయిదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం.. కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలి. వేతనాల కోసం ఇటీవల కాలంలో రెండుసార్లు కలెక్టరేట్ వద్ద ధర్నా చేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు. నెల నెలా వేతనాలు రాకపోవడంతో వారు అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. కలెక్టర్ స్పందించి తన నిధుల నుంచి అయినా వేతనాలు చెలించాలి. లేని పక్షంలో దశలవారిగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

– పుట్ట ఆంజనేయులు, సీఐటీయూ నాయకుడు

ఉపాధ్యాయుల చేతిలోనే విద్యార్థుల భవిష్యత్



రాయినిపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు



ఖిల్లాఘనపురంలో..

కొత్తకోట రూరల్: మండలంలోని రాయినిపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు శేఖ్యానాయక్, రమేష్‌గౌడ్, సురేష్‌కు గ్రామస్తులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా పాఠశాలకు నూతనంగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసులు, వరలక్ష్మి, మాధవిపి సన్మానించారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందని, ప్రతి విద్యార్థిని ఉపాధ్యాయులు తమ పిల్లల మాదిరిగా భావించి విద్యాబోధన అందించాలని తల్లిదండ్రులు కోరారు. అప్పుడే ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, అంగన్‌వాడీ టీచర్ అనసూయ, గ్రామస్తులు సురేందర్‌రెడ్డి, పాండురంగయ్య, జలేందర్, బండలయ్య, బాలయ్య ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులు బుధవారం హిందీ ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించారు. బాలుర ఉన్నత పాఠశాలలో హిందీ బోధించే ఉపాధ్యాయుడు తాజోద్దీన్ ఎస్ఏగా పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. తమకు హిందీ బోధించిన ఉపాధ్యాయుడిని హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ ట్యూటర్ కె.అర్జున్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

సమాజ శ్రేయస్సు కోసమే నూతన చట్టాలు



జెడ్పీ సమావేశ మందిరంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పెబ్బేరు రూరల్: సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం మూడు నూతన క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చిందని జిల్లా పరిషత్ సీఈఓ యాదయ్య అన్నారు. బుధవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలోని మహిళా సాధికారత బృందం (ఉమేన్ హబ్) ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుగుణంగా మూడు క్రిమినల్ చట్టాలను రూపొందించారని వివరించారు. న్యాయ నిపుణులు, మేధావులు, విద్యావంతులు, యువత వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సఖీ కేంద్రం లీగల్ కౌన్సిల్ సభ్యుడు డి.కృష్ణయ్య మాట్లాడుతూ నూతనంగా రూపుదిద్దుకున్న చట్టాల గురించి వివరించారు. మహిళలను కాపాడుతామని, చట్టాలను ఉపయోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ రామమహేశ్వర్‌రెడ్డి, మహిళా సాధికారత బృందం ప్రతినిధులు శ్రీవాణి, సలోని, సుమ, కార్యాలయ సిబ్బంది సునీత, భానుప్రసాద్, లక్ష్మారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని డీసీసీబీ డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో సింగిల్ విండో ఆధ్వర్యంలో రైతు భరోసాపై నిర్వహించిన అభిప్రాయ సేకరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం రైతుల అభిప్రాయాలను సేకరిస్తుందన్నారు. రైతులు వెల్లడించిన అభిప్రాయాలను ప్రభుత్వాన్నికి నివేదిస్తామన్నారు. సాగు చేసే భూములు, సన్న, చిన్న కారు రైతులకు మేలు జరిగే విధంగానే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని, ఇందులో రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఇప్పటికే ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతు భరోసాపై వస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. సింగిల్ విండో ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఎలాంటి కొరత లేదన్నారు. సమావేశంలో విండో వైస్ చైర్మన్ కుర్వ బాలయ్య, సీఈఓ భాస్కర్‌గౌడు, విండో డైరెక్టర్లు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఆత్మకూర్: వాట్సాప్ గ్రూపుల్లో కమిషనర్‌ను కించపరుస్తూ మెసేజీలను పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ తెలిపారు. మంగళవారం రాత్రి 11:30 గంటలకు నర్సింహ అనే వ్యక్తి మన ఆత్మకూర్ గ్రూపులో మున్సిపల్ కమిషనర్ నాగరాజును ఉద్దేశించి బూతులు తిడుతూ మేసేజ్‌ను పెట్టాడన్నారు. బుధవారం ఉదయం చూసిన కమిషనర్ సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో కులాలు, మతాలు, ఆయా వర్గాలు, ఇతరులను కించపరుస్తూ మెసేజులు పెట్టే వారిపై, గ్రూప్ అడ్మిన్లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించండి

అమరచింత: రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించి లాభాలు గడించాలని ప్రియానిక్ కంపెనీ ఏరియా మేనేజర్ బాలప్రకాష్ కోరారు. ఎత్తిపోతల జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న రైతులకు ఆయిల్‌పాం సాగు వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. ప్రభుత్వపరంగా రాయితీలు పొందుతూ మూడున్నరేళ్ల కాలం తర్వాత దిగుబడిని 15రోజులకు ఒకసారి పొందే అవకాశం ఉందన్నారు. టన్ను ఆయిల్‌పాం గింజలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరను రూ.13,428 చెల్లిస్తుందని, లిఫ్ట్ పరిదిలోని రైతులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లిఫ్ట్ ఉపాధ్యక్షుడు చంద్రన్నగౌడ్, కోశాధికారి దేశాయి సుదాంష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక మహాజన సమావేశం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక మహాజన సభ సమావేశం నిర్వహించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా, రైతు బంధుపై ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల రైతులు పాల్గొని అభిప్రాయాలు తెలియజేయాలని ఆయన కోరారు.

మాదిగల హక్కుల సాధనకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెబ్బేరు రూరల్: వరంగల్‌లో జులై 7న నిర్వహించే 30 ఏళ్ల మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మహాజన్ కోరారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో వనపర్తి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమన్వయకర్త గంధం గట్టయ్య మాదిగ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లు ఎస్సీలోని అన్ని ఉపకులాలకు జనాభా నిష్పత్తి ప్రకారంగా పంపిణీ జరగాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్డీఏ ప్రభుత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ ఉపకులాల రాష్ట్ర కార్యదర్శి చెన్నయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు గట్టుస్వామి మాదిగ, ఏడవలి భాస్కర్‌మాదిగ, శేఖర్‌మాదిగ, నాగరాజు మాదిగ, చెన్నయ్య మాదిగ, యాదగిరి మాదిగ, శ్రీనివాసులు, కృష్ణయ్య, నాగేషు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెబ్బేరు రూరల్: మున్సిపల్ కేంద్రంలోని చెలిమిల్లలో ఈ నెల 1న ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్ కొండికి ఉరేసుకొని, కర్నూలులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చెలిమిల్లకు చెందిన బుడగజగం గాంజయి ఖాసీం (37)కి కొల్లాపూర్ పట్టణానికి చెందిన లక్ష్మితో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు. పాత ఇనుప సామాను వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య లక్ష్మి భర్తతో గొడవపడి వెళ్లిపోయింది. ఈ నెల 1న ఖాసీం గ్రామంలోని తన అక్క మంత్రాలమ్మ ఇంటి వద్ద ఉండగా.. అతడి భార్య, బావ వచ్చి గొడవపడ్డారు. దీంతో తీవ్ర మనస్తాపంతో ఖాసీం ఫ్యాన్ కొండికి ఉరేసుకున్నాడు. అది చూసిన తన బావమరిది అతడిని కిందకు దించి వైద్యం కోసం కర్నూలులోని ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడని మృతుడి తల్లి సత్యమ్మ ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి

కొత్తకోట: ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్రం ప్రభుత్వం బాధ్యత వహిస్తూ ఎన్‌టీఏను రద్దు చేయడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలంటూ గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణ కేంద్రంలోని వెంకటేశ్వర ఐటీఐ కళాశాలలో విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన బంద్‌కు విద్యాసంస్థల యజమానులు సహకరించాలని, బందులో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కొత్తకోట మండల కమిటీ సభ్యులు రాజవర్ధన్, సాయి, కుమారస్వామి, రాకేష్ తదితరులు ఉన్నారు.

మైనార్టీ గురుకులంలో దోమల బెడద

- ఫ్యాన్లు లేకపోవడంతో ఇబ్బందుల్లో విద్యార్థినులు
- అధికారులు చర్యలు తీసుకోవాలి

వనపర్తి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మైనార్టీ గురుకులంలోని డార్మెటరీలో ఫ్యాన్లు లేకపోవడంతో విద్యార్థులు దోమకాట్లతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. దోమకాట్లతో బాలికల ముఖాలపై ఏర్పటిన దద్దర్లను చూసి విద్యార్థుల తల్లిదండ్రులు నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదేందని ప్రశ్నించేందుకు ప్రయత్నం చేస్తే.. ప్రిన్సిపాల్ అందుబాటులోకి రావటం లేదని విద్యార్థినుల తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నారు. పాత సైన్స్ జూనియర్ కాలేజీ భవనంలో కొనసాగుతున్న మైనార్టీ గురుకులంలో 320 మంది స్కూల్ విద్యార్థులు, 100 మంది ఇంటర్ విద్యార్థులు ఉన్నారు. ఇక్కడే డార్మెటరీ, తరగతులు నిర్వహిస్తున్న కారణంగా సరిపడా ఫ్యాన్లు, ఇతర సౌకర్యంలు లేవనే కారణాలు చెప్పన్నా.. విద్యార్థులు అనారోగ్యం బారినపడితే జవాబుదారి ఎవరనే ప్రశ్నలు విద్యార్థినుల తల్లిదండ్రుల నుంచి వస్తున్నాయి. కలెక్టర్ జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకులాన్ని సందర్శిస్తే సమస్యలు వెలుగులోకి వచ్చే అవకాశముందని వారు కోరుతున్నారు.

మున్సిపాలిటీకి వినతి

ఈ విషయంపై ప్రిన్సిపాల్ సౌమ్యను వివరణ కోరగా.. సమస్య ఉన్నమాట వాస్తవమే అని, ఫాగింగ్ కోసం వనపర్తి మున్సిపాలిటీకి లెటర్ రాశామని తెలిపారు. మిషన్లు రిపేరులో ఉన్నాయని వారు ఫాగింగ్ చేయటంలేదు. ఇంటర్ విద్యార్థినులకు కొత్త డార్మెటరీ కేటాయించడంతో స్కూల్ విద్యార్థినులు ఫ్యాన్లు లేని పాత గదుల్లో నిద్రించాల్సి వస్తుంది. తల్లిదండ్రులకు చెప్పి దోమ తెర తెప్పించుకోవాలని విద్యార్థినులకు సూచించామని చెప్పుకొచ్చారు. దోమల కాటుతో విద్యార్థినులు అస్వస్థకు గురైతే పరిస్థితి ఏంటని ప్రశ్నించగా.. గురుకులంలోనే మెడిసెన్ ఇచ్చే సౌకర్యం ఉందన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



సంగినేనిపల్లిలో ప్రమాద బాధితుడిని పరామర్శిస్తున్న నాయకులు

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లిలో ఇటీవల మరణించిన, ప్రమాదానికి గురయిన బాధిత కుటుంబ సభ్యులను కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల మరణించిన సంగమోని కృష్ణయ్య కుటుంబానికి రూ.5 వేలు, అనారోగ్య కారణంగా కుడి కాలును కోల్పోయిన మీసాల నాగరాజుకు రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. అలాగే అదే గ్రామానికి చెందిన జంగ లక్ష్మీదేవమ్మ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో గోపాలకృష్ణనాయుడు, ఉడుత రామస్వామి, కురుమయ్య, తాళ్ల కృష్ణ, చందన్‌గౌడ్, రామకృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, చిన్నికృష్ణ, రాముడు, మౌలాలి, శ్యాంసుందర్‌గౌడ్, బాలవర్ధన్, అంజన్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 23వ వార్డులో బక్కమ్మ, 2వ వార్డులో అశోక్, 20వ వార్డుకు చెందిన ఎద్దుల కృష్ణయ్య మృతి చెందారు. విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సూచన మేరకు బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ మృతిదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే పంపిన నగదును బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5వేల ఆర్థికసాయాన్ని వేరువేరుగా అందించారు. కార్యక్రమంలో నక్క రాములు, రవియాదవ్, ద్యారపోగు వెంకటేష్, కృష్ణబాబు, బొంబాయి మన్నెంకొండ, రాజు, బాలు, రాజేష్ శెట్టి ఉన్నారు.

పెబ్బేరు రూరల్: మండల కేంద్రానికి చెందిన బోయ బాలస్వామి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, పట్టణ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, హరిశంకర్‌నాయుడు, నందిమల్ల అశోక్, సత్యారెడ్డి, బలరాము, సహదేవుడు ఉన్నారు.

పాన్‌గల్: మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ నాగేష్‌నాయుడు నానమ్మ కొంకల నాగమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి బుధవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండల కాంగ్రెస్ నాయకులు రఘుపతినాయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దావాత్‌ఖాన్‌పల్లిలో..

గొర్రెలు పొలం గెట్టు దాటాయని కాపరిపై దాడి

అమరచింత: గొర్రెలు పొలం గెట్టు దాటి వచ్చి మేత మేస్తున్నాయంటూ గొర్రెల కాపరిపై దాడి చేసి రాయితో తల పగులగొట్టిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని ఎల్లపల్లికి చెందిన గొల్ల హన్మంతు తన గొర్రెల మందను గ్రామ సమీపంలోని మిట్టనందిమళ్ల శివారులో మేతకు తీసుకొచ్చాడు. అయితే తమ గ్రామానికి చెందిన గొర్రెలకు మేత దొరకదని, తన గొర్రెలను వెనక్కి తీసుకెళ్లాలని మిట్టనందిమళ్ల గ్రామానికి చెందిన ఆంజనేయుల హన్మంతుతో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య మాటమాట పెరిగి వాగ్వాదానికి దారి తీసింది. దీంతో మిట్టనందిమళ్లకు చెందిన ఆంజనేయులు హన్మంతుపై రాయి తీసుకుని దాడి చేయడంతో తలకు బలమైన గాయమైంది. రక్తస్రావంతో ఉన్న హన్మంతును ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. కాగా నారాయణపేట జిల్లాలోని ఎల్లంపల్లి, వనపర్తి జిల్లాలోని మిట్టనందిమళ్ల సరిహద్దు గ్రామాలని గెట్టు పంచాయతీ పెట్టుకొని గొడవకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. కొత్త చట్టం అమలు అయ్యాక మొదటి కేసు నమోదు అయ్యిందన్నారు.